## విలేకరులు కావలెను

హిందుస్థాన్ మీడియా తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ రాష్ట్రాలలో జిల్లా రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జులు, మండలాలవారిగా విలేకరులు కావలెను. అనుభవం కలవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి
9000306455



hindustanmedia333@gmail.com

APTEL / 2004 / 19136

# హిందుస్థాన్ మీడియా

తెలుగు దిన పత్రిక

సామాన్యుడి నేస్తం



బాలాజీ మిల్క్ ఏజెన్సీ
చేర్యాల
మా వద్ద వివాహాది శుభకార్యాలకు పాలు, పెరుగు బకెట్లు, పన్నీర్, ఐస్ క్రీం మొ, వి ఆర్డర్ పై సప్లై చేయబడును.
NSR పాలు, పాల పదార్థాలు
CONT: 9666464085



ఎడిటర్ : తాడెం. ప్రశాంత్  సిద్దిపేట  సంపుటి : 1  సంచిక : 57  గురువారం 25 జూన్ 2026, పేజీలు - 4  వెల :2/-


## ‘బాస్ స్కామ్’ పై తెలంగాణ సైబర్ బ్యూరో అలర్ట్



హిందుస్థాన్ మీడియా

రాష్ట్రంలో ‘బాస్ స్కామ్’ లేదా ‘సీఈవో ఇంపర్సొనేషన్ ఫ్రాడ్’ పేరుతో సరికొత్త సైబర్ మోసాలు పెరుగుతున్నాయని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) హెచ్చరికలు జారీ చేసింది. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, వ్యాపార యజమానులు, పౌరులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఈ మేరకు టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయల్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (I4C) జారీ చేసిన సూచనల ప్రకారం, సైబర్ నేరగాళ్లు ఉన్నతాధికారులు, వ్యాపార యజమానులను లక్ష్యంగా చేసుకుని ఈ మోసాలకు పాల్పడుతున్నారని శిఖా గోయల్ తెలిపారు. అత్యవసర పనుల పేరుతో ఈమెయిల్, వాట్సాప్ ద్వారా మాల్‌వేర్ ఉన్న ఫైల్స్ పంపిస్తున్నారని వివరించారు. దేశవ్యాప్తంగా కేవలం 20 రోజుల వ్యవధిలోనే ఇలాంటి మోసాలకు సంబంధించి 300కు పైగా ఫిర్యాదులు నమోదయ్యాయని, ఇది పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోందని ఆమె పేర్కొన్నారు. మోసగాళ్లు ZIP/RAR ఫైల్స్‌ను అత్యవసర డాక్యుమెంట్లుగా పంపిస్తారని, వాటిని ఓపెన్ చేయగానే బాధితుల ఫోన్ లేదా కంప్యూటర్‌లో మాల్‌వేర్ ఇన్‌స్టాల్ అవుతుందని ఆమె వివరించారు. దీని ద్వారా వాట్సాప్ వెబ్ సెషన్‌లు, ఇతర సమాచారాన్ని దొంగిలించి, బాధితుల పైఅధికారిలా నటిస్తూ ఉద్యోగులకు, ఆర్థిక వ్యవహారాలు చూసే సిబ్బందికి సందేశాలు పంపుతారు. అత్యవసరంగా డబ్బు బదిలీ చేయాలని లేదా రహస్య సమాచారం ఇవ్వాలని ఒత్తిడి చేస్తారు. అనుమానాస్పద ఫైల్స్, ‘అత్యవసరంగా స్పందించాలి’ వంటి సందేశాలను నమ్మవద్దని అధికారులు సూచిస్తున్నారు. డబ్బుకు సంబంధించిన అభ్యర్థనలు వస్తే, నేరుగా ఫోన్ చేసి నిర్ధారించుకోవాలి. ఒకవేళ ‘బాస్ స్కామ్’ అని అనుమానం వస్తే, ఆ సందేశానికి స్పందించకుండా, అటాచ్‌మెంట్‌ను తెరవకుండా వెంటనే ఐటీ విభాగానికి సమాచారం ఇచ్చి, ఆధారాలతో ఫిర్యాదు చేయాలని శిఖా గోయల్ కోరారు.

## ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ నేతలకు సీఎం రేవంత్ హెచ్చరిక

-‘ఎస్ఐఆర్’పై సీఎం రేవంత్ ఫోకస్.. నేతలకు స్ట్రాంగ్ వార్నింగ్!
-నిర్లక్ష్యం చేస్తే ఇన్‌చార్జిల మార్పు తప్పదని స్పష్టం
-పది రోజుల పాటు నేతల పనితీరుపై నిఘా
-గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచన
-పేదల ఓటు హక్కులను కాపాడాలని పిలుపు

హిందుస్థాన్ మీడియా

ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ అత్యంత కీలక అంశంగా పరిగణిస్తోంది. ఈ విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించే నేతలపై కఠిన చర్యలు తప్పవని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పార్టీ ఆదేశాలను అమలు చేయడంలో విఫలమైతే నియోజకవర్గ ఇన్‌చార్జిలను మార్చేందుకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. బుధవారం పార్టీ నేతలతో నిర్వహించిన జూమ్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి ఎస్ఐఆర్‌పై విస్తృతంగా చర్చించారు. ఓటరు జాబితాల నుంచి నిజమైన ఓటర్ల పేర్లు తొలగించే అవకాశం ఉందన్న నివేదికల నేపథ్యంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వచ్చే పది రోజుల పాటు నేతల పనితీరును పరిశీలిస్తామని, అలసత్వాన్ని ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. గ్రామీణ స్థాయిలో అవగాహన పెంచడంలో సర్పంచ్‌లు కూడా చురుగ్గా వ్యవహరించాలని సీఎం పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ అంశం చాలా సున్నితమైనదని, కొందరు నాయకులు దీన్ని తేలిగ్గా తీసుకుంటున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికే జిల్లా వారీగా నివేదికలు తనకు అందాయని, పార్టీకి నష్టం కలిగే పరిస్థితులను చూస్తూ ఊరుకోబోనని హెచ్చరించారు. ప్రతి నియోజకవర్గంలో మరిన్ని అవగాహన సమావేశాలు నిర్వహించాలని సీఎం ఆదేశించారు. ఈ కార్యక్రమాల విజయవంతమైన నిర్వహణ బాధ్యతలను ఇన్‌చార్జి మంత్రులకు అప్పగించారు. ముఖ్యంగా పేదల ఓటు హక్కులను కాపాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఓటు కోల్పోతే ఇతర ప్రభుత్వ పథకాలపై కూడా ప్రభావం పడే ప్రమాదం ఉందని అన్నారు. రాష్ట్రంలో ఎన్నికల సంఘం గురువారం నుంచి ఇంటింటి ఓటరు ధ్రువీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించనుంది. జూన్ 25 నుంచి జులై 24 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించనున్నారు. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలన్నీ తమ తమ కార్యాచరణను ముమ్మరం చేస్తున్నాయి.



## ఐటీ కారిడార్‌లో రూ.1000 కోట్ల ప్రభుత్వ భూమి స్వాధీనం

-హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో రూ.1000 కోట్ల స్థలాన్ని కాపాడిన హైడ్రా
-అబ్దుల్లాపూర్‌మెట్‌లో చెరువు కబ్జా యత్నం భగ్నం
-కబ్జాలపై ఉక్కుపాదం మోపిన హైడ్రా ఏజెన్సీ
-అక్రమ కట్టడాలు కూల్చివేసి ఫెన్సింగ్ ఏర్పాటు
-రెండేళ్లలో లక్ష కోట్లకు పైగా ఆస్తులను కాపాడిన హైడ్రా

హిందుస్థాన్ మీడియా

హైదరాబాద్ శివార్లలోని ఐటీ కారిడార్‌లో భారీ కబ్జా యత్నాన్ని హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) భగ్నం చేసింది. శేరిలింగంపల్లి మండలం ఖానామెట్‌లో దాదాపు రూ. 1,000 కోట్ల విలువైన ఐదెకరాల ప్రభుత్వ భూమిని అక్రమార్కుల చెర నుంచి విడిపించింది. ఈ స్థలంలో నిర్మించిన తాత్కాలిక షెడ్లు, గదిని కూల్చివేసి, భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. మెటల్ చార్మినార్ నుంచి హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌కు వెళ్లే దారిలో ఉన్న సర్వే నంబర్ 42లోని ఈ విలువైన భూమిని కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. చుట్టూ రేకులతో ఫెన్సింగ్ వేస్తుండగా రెవెన్యూ శాఖ అధికారులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన హైడ్రా సిబ్బంది, అక్రమ నిర్మాణాలను తొలగించి, ఇది ప్రభుత్వ భూమి అని సూచిస్తూ బోర్డులను ఏర్పాటు చేసింది. మరోవైపు, రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మర్రిపల్లి గ్రామంలోని చెరువు కబ్జాను కూడా హైడ్రా అడ్డుకుంది. పట్టా భూమిలో ఆర్ఎంసీ యూనిట్ ఏర్పాటు చేసిన ఓ వ్యక్తి, వ్యర్థాలను చెరువులోకి డంప్ చేస్తూ సుమారు ఐదెకరాల చెరువు భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించాడు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుతో హైడ్రా అధికారులు దర్యాప్తు చేసి, చెరువు శిఖం (ఎఫ్‌టీఎల్) పరిధిలో కార్మికుల కోసం నిర్మించిన షెడ్లను తొలగించారు. చెరువులోకి వేసిన మట్టిని వెంటనే తొలగించాలని కబ్జాదారుడిని హైడ్రా ఆదేశించింది. కాగా, గత రెండేళ్లలో హైడ్రా ఏజెన్సీ రూ. 1.10 లక్షల కోట్లకు పైగా విలువైన ప్రభుత్వ చెరువులు, నాలాలు, పార్కులు, భూములను కబ్జాల నుంచి కాపాడినట్లు ఈ నెల ప్రారంభంలో వెల్లడించింది. వచ్చే ఏడాది నాటికి రూ.2 లక్షల కోట్ల విలువైన ఆస్తుల పరిరక్షణను లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది.



## హైకోర్టు పిటిషన్ ఉపసంహరణకు ఎస్‌బీఐ సుముఖత

-రాయదుర్గం భూముల వివాదానికి ముగింపు.. వెనక్కి తగ్గిన ఎస్‌బీఐ?
-పరిష్కారం దిశగా రాయదుర్గం భూవివాదం
-ప్రత్యామ్నాయ 2.5 ఎకరాల భూమికి అంగీకారం
-టీజీఐఐసీ, ఎస్‌బీఐ మధ్య మరో విడత చర్చలు
-ఎస్‌బీఐతో ప్రభుత్వ లావాదేవీల పునరుద్ధరణకు నిర్ణయం
-హైకోర్టు విచారణ అనంతరం అధికారిక ప్రకటనకు అవకాశం


హిందుస్థాన్ మీడియా




గత కొన్ని రోజులుగా తెలంగాణ ప్రభుత్వం, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) మధ్య చర్చనీయాంశంగా మారిన రాయదుర్గం భూవివాదం పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది. ఇరు వర్గాల మధ్య జరిగిన వరుస చర్చల తర్వాత ఉద్రిక్తతలు తగ్గినట్లు సమాచారం. తాజాగా ఎస్‌బీఐ తీసుకున్న నిర్ణయాలతో ఈ వ్యవహారం త్వరలోనే ముగిసే అవకాశాలు కనిపిస్తున్నాయి. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. తెలంగాణ ప్రభుత్వ ప్రతిపాదనల పై ఎస్‌బీఐ సానుకూలంగా స్పందించింది. ఈ భూముల వ్యవహారానికి సంబంధించి హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను వెనక్కి తీసుకోవడానికి బ్యాంక్ సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో వివాదాస్పద భూమికి బదులుగా ప్రభుత్వం సూచించిన 2.5 ఎకరాల ప్రత్యామ్నాయ స్థలాన్ని స్వీకరించేందుకు కూడా అంగీకారం తెలిపినట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) అధికారులు, ఎస్‌బీఐ ప్రతినిధుల మధ్య మరోసారి సమావేశం జరగనుంది. ఈ భేటీలో మిగిలిన అంశాలపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. చర్చలు సానుకూలంగా ముగిస్తే భూ వివాదానికి పూర్తిస్థాయిలో తెరపడే అవకాశం ఉంది. ఇక ఈ వివాదం కారణంగా ఎస్‌బీఐపై తెలంగాణ ప్రభుత్వం గతంలో కఠిన వైఖరి అవలంబించింది. ప్రభుత్వ శాఖలకు చెందిన పలు లావాదేవీల విషయంలో పరిమితులు విధిస్తూ అంతర్గతంగా ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఈ వ్యవహారం రాజకీయ, ఆర్థిక వర్గాల్లో కూడా చర్చకు దారితీసింది. అయితే ఇప్పుడు పరిస్థితి మారుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఎస్‌బీఐ వైఖరిలో మార్పు రావడంతో ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. బ్యాంక్‌తో కొనసాగుతున్న ప్రభుత్వ లావాదేవీలను తిరిగి సాధారణ స్థితికి తీసుకురావాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ప్రభుత్వ గ్రాంట్ల నిర్వహణతో పాటు ఎస్‌బీఐకి ఉన్న లీడ్ బ్యాంక్ హోదాను కూడా కొనసాగించే అవకాశాలు ఉన్నాయి. హైకోర్టులో తదుపరి విచారణ పూర్తయిన తర్వాత ఈ అంశంపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. అప్పటివరకు ఇరు పక్షాలు చర్చల ప్రక్రియను కొనసాగించే అవకాశముంది.

## తెలంగాణ పై ఫుల్ ఫోకస్ పెట్టిన జనసేనాని

హిందుస్థాన్ మీడియా



ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వంలో అత్యంత కీలక భాగస్వామిగా ఉన్న జనసేన పార్టీ ఇప్పుడు పొరుగు రాష్ట్రమైన తెలంగాణపై తన ఫోకస్ పెంచింది. తెలంగాణలో పార్టీ ఉనికిని చాటడమే కాకుండా, క్షేత్రస్థాయిలో కేడర్‌ను బలోపేతం చేసేందుకు జనసేనాని, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కార్యాచరణ మొదలుపెట్టారు. రాష్ట్రంలో పార్టీ కార్యకలాపాలను క్రమబద్ధీకరిం చడానికి, ఇతర పార్టీల నుండి వచ్చే వలసలను సమన్వయం చేయడానికి ఏడుగురు సభ్యులతో కూడిన ‘తెలంగాణ జాయినింగ్స్ కమిటీ’ని అధికారికంగా నియమించారు. పార్టీ భావజాలానికి ఆకర్షితులవుతున్న విద్యావంతులు, సామాజికవేత్తలు, రిటైర్డ్ ఐఏఎస్/ఐపీఎస్ అధికారులు, తటస్థులను లైన్‌లోకి తెచ్చే బాధ్యతను ఈ ఏడుగురు సభ్యులకు అప్పగించారు. ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్, డా. గడల శ్రీనివాస్ (తెలంగాణ రాష్ట్ర మాజీ మెడికల్ డైరెక్టర్), గొట్టిముక్కల నరేష్ రెడ్డి, అబ్దుల్ హనీఫ్ ,అల్లాడి తనీష్ (సినీ నటుడు), చిరాగ్ ప్రజీత్ గౌడ్, మేడూరి సరస్వతి (తెలంగాణ రాష్ట్ర మాజీ డీసీపీ), తెలంగాణ వ్యాప్తంగా వస్తున్న చేరికల విజ్ఞప్తులను ఈ జాయినింగ్స్ కమిటీ మొదట క్షుణ్ణంగా పరిశీలిస్తుంది. ఆ తర్వాత ఆ రిపోర్టులను జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి క్లియరెన్స్ చేసి, నేరుగా అధినేత పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తారు. అనంతరం పవన్ ఇచ్చే దిశా నిర్దేశం మేరకు త్వరలోనే హైదరాబాద్ వేదికగా భారీ ఎత్తున చేరికల కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించనున్నారు.

# కొమురవెల్లి అంతర్- జిల్లా దొంగల ముఠా గుట్టురట్టు

**-ముగ్గురు నిందితుల అరెస్టు**
**-బంగారం, వెండి, రెండు వాహనాలు, మొత్తం 7 లక్షల విలువగల సొత్తు స్వాధీనం**

హిందుస్థాన్ మీడియా, కొమురవెల్లి:




సిద్దిపేట జిల్లా కొమురవెల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన చోరీ కేసును పోలీసులు చేదించారు. ఫిర్యాదారుడు సార్ల సురేష్ (39) తన ఇంట్లో ఎవరూ లేనప్పుడు, ఇంట్లో ఉన్నటువంటి బంగారం, వెండి ఆభరణాలు దొంగతనం జరిగినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 30 మే 2026 రోజున కొమురెల్లి పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేయడం జరిగింది. ఈ క్రమంలో నిన్న అనగా తేదీ 23 జూన్ 2026 న కొమురవెల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని వేచరేణి గ్రామ శివారులో గల గుర్జకుంట కమాన్ వద్ద ఎస్ఐ టి మహేష్ సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించారు. విచారణలో నిందితులు ూా-1 గా డొంగరి రాజు (31) తండ్రి లింగం ,ూా-2 గా పొట్ట ప్రవీణ్ (29) తండ్రి రాజు,ూా-3 గా బొద్దుల శ్రీనాథ్ (28) తండ్రి ప్రభాకర్ ముద్దాయిలు మెదక్ జిల్లా కుల్చారం పోలీస్ స్టేషన్ పరిధిలో చేపల దుకాణంలో మహిళ మెడలో బంగారు పుస్తెల తాడు, ఒక మొబైల్ ఫోన్‌ను అపహరించినట్లు, నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మొబైల్ షాపులో హెచ్‌పీ ల్యాప్‌టాప్, సీసీ కెమెరా మానిటర్‌ను దొంగిలించినట్లు, అలాగే కొమురవెల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో తాళం వేసి ఉన్న ఇంటిలో చోరీ చేసి బంగారు ఆభరణాలు, వెండి ఆభరణాలు మరియు నగదును అపహరించినట్లు అంగీకరించారు. దొంగిలించిన బంగారు ఆభరణాలలో కొంత భాగాన్ని హైదరాబాద్‌లో విక్రయించగా, కుల్చారం కేసుకు సంబంధించిన బంగారు పుస్తెల తాడును నిజామాబాద్‌లోని ఫెడ్ బ్యాంకులో కుదువ పెట్టినట్లు విచారణలో వెల్లడైంది. స్వాధీనం చేసిన వస్తువులు: న్రూ కంపెనీ ల్యాప్‌టాప్, జజుు మానిటర్, నేరాలకు ఉపయోగించిన, పల్సర్ చీూ 200 మోటార్ సైకిల్ నెంబర్ ూ16జుఔ5296, యాక్టివా స్కూటీ నెంబర్ ు+08+8637, 3 తులాల బంగారు గొలుసు, 7 గ్రాముల బంగారు ఆభరణాలు, 8 తులాల వెండి పట్టగొలుసులు, 1 తులం వెండి కుంకుమ్ భరణ, 1 తులం వెండి ఉగ్గ గిన్నె, 3 మొబైల్ ఫోన్లు, మొత్తం 7 లక్షల విలువగల సొత్తు స్వాధీనం. ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన బి రమేష్ సిఐ చెరియాల్, కొమురవెల్లి పోలీస్ స్టేషన్ ఎస్ఐ టి మహేష్ తో పాటు, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, ఎస్ ఐ తిరుపతి రెడ్డి, సిబ్బందినీ సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్, ఐపిఎస్ అభినందించారు. ప్రజలకు విజ్ఞప్తి: ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద, కాలనీల్లో, వ్యాపార సముదాయాల వద్ద తప్పనిసరిగా సిసిటివి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి. దొంగతనాల నివారణకు, నిందితులను త్వరగా పట్టుకోవడానికి సిసిటివి కెమెరాలు మూడవ కన్నులా పనిచేస్తాయి. మీ గ్రామంలో లేదా కాలనీల్లో కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా తిరిగే వారిని గమనిస్తే వెంటనే అలర్ట్ అవ్వండి, వెంటనే డయల్ 100 కు లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలి. సమాచారం అందించిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచబడతాయి.

## కళాకారుడు పిన్నింటి దాసుకు ఉత్తమ ప్రతిభ ప్రశంస పత్రం



హిందుస్థాన్ మీడియా, కొమురవెల్లి:

సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం అయినాపూర్ గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమ కళాకారుడు పిన్నింటి దాసు మంగళవారం రోజు రవీంద్రభారతిలో జరిగిన 99 రోజుల ప్రజా కలల దినోత్సవం పురస్కరించుకొని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, తెలంగాణ సాంస్కృతిక సారథి ఏఓ విజయ్ కుమార్ చేతుల మీదుగా ఉత్తమ కళాకారునిగా ప్రతిభ ప్రశంస పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా పిన్నింటి దాసు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కళాకారులకు గుర్తింపు కార్డులు అందజేస్తుందని, రానున్న రోజులలో ఉపాధి అవకాశాలు ఇంకా పొందే విధంగా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రతి జిల్లాలకు ఏర్పాటు చేయాలని తెలంగాణ సాంస్కృతిక సారథిలో నిరుద్యోగ కళాకారులకు అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు,

## పెంచిన ఎరువుల ధరలను తగ్గించాలని డిమాండ్

**-కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేసిన రైతు సంఘం నాయకులు**



సిద్దిపేట, జూన్ 23 (హిందుస్థాన్ మీడియా):

రైతులకు ఏకకాలంలో రైతు భరోసా నిధులను విడుదల చేయాలని, రుణమాఫీ పొందని రైతులకు వెంటనే రుణమాఫీ అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (AIKS) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడల వనేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సిద్దిపేటలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో వివిధ రైతు సమస్యలపై నిరసన వ్యక్తం చేస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ (ఏఓ) రాజుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎడల వనేష్ మాట్లాడుతూ, ఇటీవల ఎరువుల ధరలు పెరగడంతో రైతులపై అదనపు భారం పడిందని, పెంచిన ధరలను వెంటనే తగ్గించి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. అలాగే రైతు భరోసా నిధులను అన్ని అర్హులైన రైతులకు ఒకేసారి విడుదల చేయాలని, ఇంకా రుణమాఫీ అమలు కాని రైతులకు వెంటనే వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల శ్రీనివాస్, మల్లయ్య తదితర రైతు నాయకులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధే మా ప్రధాన ధ్యేయం!

**-లింగంపల్లిలో రూ. 12 లక్షల వ్యయంతో 'సీసీ రోడ్డు' పనులకు శంకుస్థాపన చేసిన జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి**

బచ్చన్నపేట/లింగంపల్లి (హిందూస్తాన్ మీడియా):



గ్రామీణ ప్రాంతాల సర్వాంగీణ అభివృద్ధే లక్ష్యంగా తాము నిరంతరం శ్రమిస్తున్నట్లు జనగామ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ పల్లా రాజేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. బచ్చన్నపేట మండల పరిధిలోని లింగంపల్లి గ్రామంలో బుధవారం (జూన్ 24) పలు అభివృద్ధి పనులకు అధికారికంగా శ్రీకారం చుట్టారు.ఉపాధి హామీ పథకం నిధుల నుంచి రూ. 12 లక్షల భారీ వ్యయంతో నూతనంగా నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్డు పనులకు ఇక్కడ శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, భూమి పూజ చేసి నిర్మాణ పనులను ప్రారంభించారు.

**-మౌలిక వసతుల కల్పనకే మొదటి ప్రాధాన్యత..**

అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి బీటీ మరియు సీసీ రోడ్ల సౌకర్యాన్ని కల్పించి, మెరుగైన మౌలిక వసతులను సమకూర్చడమే తమ మొదటి ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ఉపాధి హామీ నిధులను క్షేత్రస్థాయిలో పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుంటూ, గ్రామాల్లో అంతర్గత రహదారులు మరియు మౌలిక సదు పాయాల కొరత అనేది లేకుండా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతామని ఆయన హామీ ఇచ్చారు.

**-నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి:**

గ్రామాల్లో చేపట్టే ప్రజా పనుల్లో ఎలాంటి రాజీ లేకుండా ఖచ్చితమైన నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సంబంధిత కాంట్రాక్టర్లను, ఇంజనీరింగ్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. నిర్దేశిత గడువు లోపు ఈ సీసీ రోడ్డు నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసి, స్థానిక ప్రజల రవాణా సౌకర్యార్థం అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో బచ్చన్నపేట మండల ప్రజాప్రతినిధులు, గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, స్థానిక వర్ధమాన నాయకులు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు, గ్రామ పెద్దలు మరియు స్థానిక యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని హర్షం వ్యక్తం చేశారు.

## బైరాన్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో 'అక్షరాభ్యాసం!

**-చిన్నారులకు ఉచితంగా యూనిఫామ్‌ల పంపిణీ చేసిన సర్పంచ్ బర్మా రాజమల్లయ్య**

?ధూళిమిట్ట/బైరాన్‌పల్లి (హిందూస్తాన్ మీడియా):



గ్రామీణ ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారుల బంగారు భవిష్యత్తుకు తొలి పునాది అని బైరాన్‌పల్లి గ్రామ సర్పంచ్ బర్మా రాజమల్లయ్య పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని చారిత్రక బైరాన్‌పల్లి గ్రామ అంగన్‌వాడీ 1వ కేంద్రంలో నూతన విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకుని చిన్నారులకు ప్రత్యేక అక్షరాభ్యాస మహోత్సవం మరియు ఉచిత దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకకు సర్పంచ్ బర్మా రాజమల్లయ్య ముఖ్య అతిథిగా హాజరై, పిల్లలతో అక్షరాభ్యాసం చేపించారు.అనంతరం కేంద్రంలో చదువుకుంటున్న 3 సంవత్సరాల నుండి 6 సంవత్సరాల వయస్సు గల అంగన్‌వాడీ చిన్నారులందరికీ ప్రభుత్వం సరఫరా చేసిన నూతన యూనిఫామ్‌లను (దుస్తులను) ప్రజాప్రతినిధులు, అధికారుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ?ఈ సందర్భంగా సర్పంచ్ బర్మా రాజమల్లయ్య మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు మరియు చిన్న పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపాన్ని నివారించడానికి ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అనేక రకాల పౌష్టికాహార పథకాలను అమలు చేస్తోందన్నారు. కేంద్రం నుండి లభించే పాలు, గుడ్లు, బాలామృతం వంటి పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అర్హులైన తల్లులందరూ నిరంతరం సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. సరైన పౌష్టికాహారం తీసుకోవడం వల్లే తల్లీ, పిల్లలిద్దరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని, తద్వారా ఆరోగ్యకరమైన సమాజం సిద్ధిస్తుందని సర్పంచ్ ఆశాభావం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ ప్లే-స్కూళ్లకు పంపి డబ్బులు వృథా చేసుకోకుండా, అన్ని వసతులు గల ప్రభుత్వ అంగన్‌వాడీ కేంద్రాల్లోనే చేర్పించాలని కోరారు. ? ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ సిద్ధులు, మండల విద్యాధికారి మీనాంజనేయులు ,పంచాయతీ సెక్రెటరీ కట్కూరి రాజు , స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు వివేక్,అంగన్‌వాడీ కేంద్రం నిర్వాహకురాలు విజయ, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ రావుల రజిత, అంగన్‌వాడీ విద్యార్థుల తల్లిదండ్రులు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు..

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం: 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' నిరంతర ప్రక్రియగా కొనసాగాలి

**-జిల్లా ప్రత్యేక అధికారి రాజీవ్ గాంధీ హనుమంతు**
**-జిల్లాలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక**
**-విజయవంతం:జిల్లా కలెక్టర్ రాజర్షిషా**

(హిందూస్తాన్ మీడియా)



ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' నిరంతర ప్రక్రియగా కొనసాగాలని జిల్లా ప్రత్యేక అధికారి రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంపై బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా,ఎస్పీ అఖిల్ మహాజన్ తో కలిసి ఆయన జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మార్చి 6 నుండి జూన్ 12 వరకు జరిగిన ఈ 99 రోజుల కార్యక్రమానికి సంబంధించి,ముఖ్యమంత్రి క్యాబినెట్ మంత్రుల ఆదేశాల ప్రకారం 10 విభాగాలలో నిర్దేశించిన పనులను అధికారులు క్షేత్రస్థాయిలో ముమ్మరంగా ప్రజల్లోకి తీసుకెళ్లారని వెల్లడించారు. అయితే, ఈ 99 రోజుల కార్యక్రమం ముగిసినప్పటికీ, ఇక్కడితో ఇది ఆగిపోకుండా భవిష్యత్తులో ఇదే స్ఫూర్తితో నిరంతరం కొనసాగేలా పర్యవేక్షించడానికే ప్రభుత్వం స్పెషల్ ఆఫీసర్లను నియమించిందని స్పష్టం చేశారు.గ్రామసభలు, మండల స్థాయి సమావేశాలలో ప్రజల నుండి సేకరించిన వ్యక్తిగత,కమ్యూనిటీ సంస్థాగత వినతులను అన్ని శాఖల అధికారులు క్రోడీకరించి,వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారా వచ్చిన అనుభవాలు, ఫీడ్‌బ్యాక్ ఆధారంగా ప్రతి శాఖ రాబోయే ఒకటి లేదా రెండు సంవత్సరాల కాలానికి గాను ఒక సమగ్రమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని సూచించారు. సీఎం, డిప్యూటీ సీఎం, జిల్లా ఇంచార్జ్ మంత్రుల పర్యటనల సందర్భంగా జిల్లాలో జరిగిన శంకుస్థాపనలు, మంజూరైన జీవోలకు సంబంధించి టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి పనులను త్వరితగతిన గ్రౌండ్ చేయాలని, సీఎం ఇచ్చిన హామీలపై నిరంతరం ఫాలో-అప్ ఉండాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలో చేపట్టిన అన్ని మంచి ఇనిషియేటివ్స్ నిరంతరం కొనసాగేలా చర్యలు తీసుకో వాలన్నారు. అలాగే,జిల్లాలోని 131 రెసిడెన్షియల్ విద్యాసంస్థలను జిల్లా అధికారులు రెగ్యులర్‌గా సందర్శించి అక్కడి పరిశుభ్రతను, ముఖ్యంగా విద్యార్థులకు అందించే ఆహార నాణ్యతను స్వయంగా పరిశీలించాలని ప్రత్యేక అధికారి స్పష్టం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. .మార్చి 6 నుండి జూన్ 12 వరకు జిల్లాలో పారిశుధ్యం, ఆరోగ్యం,ఫైల్స్ క్లియరెన్స్ వంటి ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ పలు అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించామన్నారు. నిరుద్యోగ యువత కోసం ఏర్పాటు చేసిన జాబ్ మేళాకు మంచి స్పందన లభించిందనీ,జిల్లాలో ముఖ్యమంత్రి,ఉప ముఖ్యమంత్రి, రవాణా శాఖ మంత్రి,డీజీపీల పర్యటనలు విజయవంతంగా ముగిశాయయని, ఇంచార్జ్ మంత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు, ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు,కుట్టు మిషన్ల పంపిణీ జరగ్గా, డీజీపీ మత్తుపదార్థాల నియంత్రణపై యువతకు అవగాహన కల్పించారనీ వివరించారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీల బుక్‌లెట్‌తో పాటు జిల్లా సాధించిన విజయాలు, సంక్షేమ లబ్ధి,ఫిర్యాదుల పరిష్కారం నూతన ఆవిష్కరణలతో కూడిన "సమగ్ర ప్రగతి నివేదికను"త్వరలోనే ప్రభుత్వానికి సమర్పించనున్నారు. నంతరం జిల్లా ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కు సంబంధించిన బుక్ లెట్ ను ప్రత్యేక అధికారి ఆవిష్కరించారు.ఈ సమీక్ష సమీవేశంలో అదనపు కలెక్టర్లు ఆర్.ఎస్.చిత్రు, రాజేశ్వర్, జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్,వివిధ శాఖల జిల్లా అధికారులు,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## ఐదేళ్లలో రూ.40,000 కోట్ల పెట్టుబడి: టాటా మోటార్స్ పీవీ




న్యూఢిల్లీ:
భారత ఆటోమొబైల్ రంగంలో తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్స్ లిమిటెడ్ (టీఎంపీవీ) భారీ పెట్టుబడి ప్రణాళికను ప్రకటించింది. ఇందులో భాగంగా వ చ్చే ఐదేళ్లలో రూ. 40,000 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టనున్నట్లు కంపెనీ ఎండీ, సీఈఓ శైలేష్ చంద్ర వెల్లడించారు. అంతే కాకుండా ప్యాసింజర్ వెహికల్ మార్కెట్లో 20 శాతం వాటాను చేజిక్కించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. దీంతో పాటు 6 కొత్త మోడళ్లను మార్కెట్లోకి విడుదల చేయాలని ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం కంపెనీ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 9 లక్షల యూనిట్లుగా ఉంది. దీనికి మరో 4 లక్షల యూనిట్లను జోడించడంతో రెండు మూడేళ్లలో వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని 13 లక్షల యూనిట్లకు చేర్చాలని టాటా మోటార్స్ పీవీ భావిస్తోంది.

## బీఎస్ఎన్ఎల్ సీఎండీ పోస్టు-తొలిసారిగా ప్రైవేటు రంగానికి అవకాశం

ప్రభుత్వ రంగ టెలికాం దిగ్గజం భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) పదవి భర్తీకి కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. విశేషమేమిటంటే, ఈసారి ప్రైవేట్ రంగ నిపుణులకు కూడా ఈ పదవికి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తూ టెలికాం శాఖ (డీఓటీ) నిర్ణయం తీసుకుంది. దాదాపు రెండేళ్లుగా పూర్తిస్థాయి అధిపతి లేకుండా కొనసాగుతున్న బీఎస్ఎన్ఎల్‌కు ఇది అత్యంత కీలక నియామకం. పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సెలక్షన్ బోర్డ్ (పీఈఎస్‌బీ) ఛైర్మన్ నేతృత్వంలోని సెర్చ్-కమ్-సెలక్షన్ కమిటీ (ఎస్‌సీఎస్‌సీ) ఈ నియామక ప్రక్రియను పర్యవేక్షించనుంది. ఆసక్తిగల అభ్యర్థులు జూలై 22 సాయంత్రం 3 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఈ పదవికి వేతన స్కేలు నెలకు రూ. 80,000 నుంచి రూ. 1,25,000 వరకు నిర్ణయించారు. ప్రస్తుతం టెలికాం శాఖ ఉన్నతాధికారి రాబర్ట్ జె. రవి అదనపు బాధ్యతలతో సీఎండీగా కొనసాగుతున్నారు. ఆయన పదవీకాలాన్ని 2026 అక్టోబర్ వరకు పొడిగించారు. ఈ పదవికి దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయసు 45 నుంచి 59 ఏళ్ల మధ్య ఉండాలి. ఇంజనీరింగ్, సీఏ, కాస్ట్ అకౌంటెన్సీ లేదా మేనేజ్‌మెంట్ విభాగాల్లో విద్యార్హతలు కలిగి ఉండటం తప్పనిసరి. ప్రైవేట్ రంగ అభ్యర్థులైతే, గత మూడేళ్లుగా సగటున రూ. 2,000 కోట్ల వార్షిక టర్నోవర్ ఉన్న సంస్థలో బోర్డు స్థాయి హోదాలో పనిచేసిన అనుభవం ఉండాలి. గతంలో 2025 నాటికి ఈ పదవిని భర్తీ చేయాలని ప్రయత్నిం చినప్పటికీ, తగిన అభ్యర్థి లభించకపోవడంతో ఈసారి విస్తృత స్థాయిలో నోటిఫికేషన్ జారీ చేశారు. ప్రైవేట్ టెలికాం సంస్థల నుంచి తీవ్ర పోటీ ఎదుర్కొంటున్న బీఎస్ఎన్ఎల్, ప్రస్తుతం ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటోంది. 2026 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ నికర నష్టం రూ. 4,738 కోట్లుగా నమోదైంది. ఈ నేపథ్యంలో 4జీ సేవలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడం, 5జీ సన్నద్ధత, సంస్థను ఆర్థిక పునరుద్ధరణ పథంలో నడిపించడం వంటి కీలక బాధ్యతలు కొత్త సీఎండీపై ఉండనున్నాయి.

## 140 కోట్ల బ్యారెళ్ల నిల్వలున్నా తప్పని తిప్పలు.. చైనా ఇంధన భద్రతకు హెచ్చరికగా హర్మూజ్ సంక్షోభం!



అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం.. ప్రపంచంలోనే అత్యధికంగా ముడి చమురును దిగుమతి చేసుకునే చైనాకు పెద్ద ఊరటనిచ్చింది. ఈ ఒప్పందంలో భాగంగా హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడం, తదుపరి చర్చల కోసం 60 రోజుల గడువు ఇవ్వడం వల్ల చైనాకు ఇంధన సరఫరా ఇబ్బందులు తాత్కాలికంగా తొలిగాయి. అయినప్పటికీ, ఈ అంతర్జాతీయ వివాదం వల్ల చైనా ఆర్థిక వ్యవస్థ భారీ ముప్పును ఎదుర్కుంటోందని, ఈ యుద్ధం కారణంగా డ్రాగన్ కంట్రీ ఆర్థికంగా నష్టపోయిన దేశాల జాబితాలోకి జారుకుంటోందని అంతర్జాతీయ విశ్లేషకులు చెబుతున్నారు. యుద్ధం కారణంగా హర్మూజ్ జలసంధి మూసివేత వల్ల చమురు, ద్రవీకృత సహజ వాయువు (ఎన్ఎన్‌జీ) రవాణా పూర్తిగా స్తంభించింది. చైనా వార్షిక ముడి చమురు దిగుమతుల్లో, ఇంధన సరఫరాలో దాదాపు సగం వాటా ఈ ఇరుకైన జలమార్గం గుండానే సాగుతుంది. చైనా తన వ్యూహాత్మక నిల్వలను ఉపయోగించి స్వల్పకాలిక నష్టాలను తగ్గించుకున్నప్పటికీ, ఉత్పాదక రంగంపై ఆధారపడే ఆ దేశ ఆర్థిక వ్యవస్థకు ఈ ఉద్రిక్తతలు పెద్ద సవాలుగా మారాయి. చైనా తన ముడి చమురులో దాదాపు 50 శాతాన్ని హర్మూజ్ జలసంధి ద్వారానే దిగుమతి చేసుకుంటుంది. దీని మూసివేత వల్ల చైనాలోని రవాణా, పెట్రోకెమికల్స్, మ్యాను ఫ్యాక్చరింగ్, ఎగుమతి రంగాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. ఇంధన ధరల పెరుగుదల వల్ల అంతర్జాతీయ మార్కెట్లో చైనా వస్తువులకు డిమాండ్ తగ్గింది. ఇప్పటికే దేశీయంగా వినియోగదారుల నమ్మకం తగ్గడం, రియల్ ఎస్టేట్ రంగంలో సమస్యలు ఎదుర్కొంటున్న చైనాకు ఈ అంతర్జాతీయ ఉద్రిక్తతలు అదనపు భారంగా మారాయి. అయితే, ఈ సంక్షోభాన్ని చైనా కొంతవరకు తట్టుకోగలిగింది. చైనా వద్ద దాదాపు 1.2 నుండి 1.4 బిలియన్ బ్యారెళ్ల వ్యూహాత్మక చమురు నిల్వలు ఉన్నాయి. ఇవి ఆ దేశానికి నాలుగు నెలల పాటు సరిపోతాయి. వీటితో పాటు రష్యా నుండి చమురు దిగుమతులను పెంచడం, దేశీయ బొగ్గు నిల్వలు, పునరుత్పాదక ఇంధనంపై ఆధారపడటం వల్ల చైనా తక్షణ ప్రమాదం నుండి బయటపడింది.

## టీమిండియా యువ హిట్టర్ వైభవ్‌పై కపిల్ ఆసక్తికర వ్యాఖ్యలు




స్పోర్ట్స్ డెస్క్:
భారత క్రికెట్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ప్రతిభపై లెజెండరీ క్రికెటర్ కపిల్ దేవ్ ప్రశంసల వర్షం కురిపించారు. అయితే, వైభవ్‌కు అసలైన సవాలు ముందుందని ఆయన అభిప్రాయపడ్డారు. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ 16 ఏళ్ల వయసులో అంతర్జాతీయ అరంగేట్రం చేసి సంచలనం సృష్టించాడు. దాదాపు 37 ఏళ్ల తర్వాత ఇప్పుడు సచిన్ కంటే తక్కువ వయసులోనే టీమిండియా తరఫున ఆడేందుకు సిద్ధమయ్యాడు వైభవ్. ఈ నేపథ్యంలో ఓ జాతీయ మీడియాతో కపిల్ దేవ్ మాట్లాడుతూ.. 'వైభవ్ అసాధారణ ప్రతిభ కలిగిన ఆటగాడు. ప్రస్తుతం అతడిది చాలా చిన్న వయసు. 20 నుంచి 22 ఏళ్ల వయసుకు చేరుకున్నాకే అతడి అసలైన ప్రతిభను మనం అంచనా వేయగలం. 20 ఏళ్ల తర్వాతనే అతడి ఆటను జడ్జ్ చేద్దాం. 16 ఏళ్ల వయసులో సచిన్ ఎలా ఉన్నాడో, వైభవ్ కూడా అలాగే కనిపిస్తున్నాడు. కానీ, సచిన్‌లా సుదీర్ఘ కాలం పాటు ఆడగలడా? అనేది కాలమే నిర్ణయించాలి. అతడు ప్రయాణించాల్సిన దూరం ఇంకా చాలా ఉంది' అని కపిల్ దేవ్ పేర్కొన్నారు. ఇటీవల శ్రీలంకలో జరిగిన ముక్కోణపు సిరీస్‌లో తొలి నాలుగు మ్యాచుల్లో కాస్త ఫామ్ కోల్పోయిన వైభవ్.. ఫైనల్లో మాత్రం 94 పరుగుల సుడిగాలి ఇన్నింగ్స్‌తో సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. ఐపీఎల్ 2026, ఇటీవల జరిగిన ట్రై సిరీస్ లో అద్భుత ప్రదర్శనతో ఐర్లాండ్, ఇంగ్లండ్ సిరీస్‌ల కోసం భారత టీ20 జట్టులో చోటు దక్కించు కున్నాడు. శుక్రవారం జరగబోయే మ్యాచ్‌తో వైభవ్ అరంగేట్రం చేసేందుకు రెడీ అయ్యాడు. ఈ సందర్భంగా వైభవ్‌తో పాటు భారత జట్టు మొత్తానికి కపిల్ దేవ్ ఆల్ ది బెస్ట్ చెప్పారు.


## ఐసీసీ ర్యాంకింగ్స్: రెండో స్థానానికి దూసుకెళ్లిన కెప్టెన్ శుభ్‌మన్ గిల్




స్పోర్ట్స్ డెస్క్:
ఐసీసీ తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో టీమిండియా వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ దుమ్మురేపాడు. అఫ్గానిస్థాన్‌తో ఇటీవల ముగిసిన మూడు మ్యాచుల వన్డే సిరీస్‌లో అద్భుత ప్రదర్శన చేసిన గిల్ బ్యాటింగ్ విభాగంలో ఏకంగా మూడు స్థానాలు ఎగబాకి రెండో ర్యాంకుకు చేరుకున్నాడు. ఈ సిరీస్‌లోని తొలి రెండు వన్డేల్లో గిల్ 84, 154 పరుగులతో వీరోచిత ఇన్నింగ్స్ ఆడాడు. దీంతో ప్రస్తుతం నంబర్ 1 స్థానంలో ఉన్న న్యూజిలాండ్ స్టార్ డారిల్ మిచెల్ కంటే గిల్ కేవలం 24 రేటింగ్ పాయింట్ల వెనుకంజలో ఉన్నాడు. మరోవైపు, తొడకండరాల గాయం కారణంగా ఈ సిరీస్‌కు దూరమైన విరాట్ కోహ్లీ ఒక స్థానం దిగజారి మూడో ర్యాంకుకు పడిపోగా.. రోహిత్ శర్మ నాలుగో స్థానంలోనే కొనసాగుతున్నాడు. టీమిండియా పాకెట్ డైనమైట్ ఇషాన్ కిషన్ 21 స్థానాలు దూసుకెళ్లి 43వ ర్యాంకు సాధించగా, శ్రేయస్ అయ్యర్ 14వ స్థానానికి చేరాడు. కేఎల్ రాహుల్ రెండు స్థానాలు కోల్పోయి 11వ స్థానానికి పరిమితమయ్యాడు. బౌలింగ్ విభాగంలోనూ టీమిండియా యువ బౌలర్లు సైతం సత్తాచాటారు. పేసర్ అర్ష్‌దీప్ సింగ్ 16 స్థానాలు మెరుగుపరుచుకుని 22వ ర్యాంకుకు చేరగా, ప్రసిద్ధ్ కృష్ణ ఏకంగా 34 స్థానాలు ఎగబాకి 58వ ర్యాంకును దక్కించుకున్నాడు. ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ 71వ స్థానంలో నిలిచాడు. మరోవైపు టెస్ట్ బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో న్యూజిలాండ్ ఫాస్ట్ బౌలర్ మ్యాట్ హెన్రీ సరికొత్త రికార్డు సృష్టించాడు. ఇంగ్లండ్‌తో జరిగిన రెండో టెస్టులో 11 వికెట్లతో చెలరేగి కివీస్ 253 పరుగుల భారీ విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ అద్భుత ప్రదర్శనతో హెన్రీ టెస్టుల్లో నంబర్ 1 బౌలర్‌గా అవతరించాడు. ప్రస్తుతం ఆయన టీమిండియా స్పీడ్‌స్టర్ జస్ప్రీత్ బుమ్రాతో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నాడు. కివీస్ క్రికెట్ చరిత్రలో జాక్ కౌవీ, రిచర్డ్ హాడ్లీల తర్వాత 36 ఏళ్లకు టెస్టుల్లో నంబర్ వన్ ర్యాంకు సాధించిన మూడో ఫాస్ట్ బౌలర్‌గా 34 ఏళ్ల మ్యాట్ హెన్రీ అరుదైన ఘనత సాధించాడు.

# స్పోర్ట్స్

## పాకిస్థాన్ మాజీ క్రికెటర్ షోయబ్ అక్తర్ ఇంట విషాదం




స్పోర్ట్స్ డెస్క్:
పాకిస్థాన్ దిగ్గజ క్రికెటర్, రావల్పిండి ఎక్స్‌ప్రెస్ షోయబ్ అక్తర్ ఇంట్లో విషాదం నెలకొంది. ఆయన పెద్దన్నయ్య షాహిద్ అక్తర్ కన్నుమూశారు. ఈ విషయాన్ని అక్తర్ స్వయంగా తన సోషల్ మీడియా ఖాతా ద్వారా అభిమానులతో పంచుకున్నాడు. స్థానిక మీడియా కథనం ప్రకారం.. షాహిద్ అక్తర్ మంగళవారం అర్ధరాత్రి సమయంలోనే మృతి చెందినట్లు తెలుస్తోంది. నా ప్రియమైన సోదరుడు షాహిద్ అక్తర్ అల్లా చెంతకు చేరారు. అతడి మృతిపై నేను ఎంతగానో విచారిస్తున్నాను' అంటూ అక్తర్ భావోద్వేగ పోస్ట్ పెట్టారు. మరోవైపు పాకిస్థాన్ మాజీ కెప్టెన్ రషీద్ లతీఫ్ కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించాడు. హెచ్-8 స్మశానవాటికలో అంత్యక్రియల ప్రార్థనలు జరుగుతాయని, షాహిద్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించాలని అతడు ఫేస్‌బుక్ ద్వారా కోరాడు. అయితే షాహిద్ అక్తర్ మరణానికి గల కారణాలు మాత్రం ఇంకా వెల్లడి కాలేదు. దాదాపు ఐదేళ్ల క్రితం అంటే 2021లో అక్తర్ తన మాతృమూర్తి కోల్పోయాడు. ఆ సమయంలో అక్తర్‌కు షాహిద్ అక్తర్ అండగా ఉన్నాడు. ఇప్పుడు ఆ అన్నయ్యను కూడా కోల్పోవడంతో అక్తర్ కుటుంబంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. ఈ వార్త తెలిసిన వెంటనే పలువురు మాజీ పాక్ క్రికెటర్లు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రీడా అభిమానులు సోషల్ మీడియా ద్వారా అక్తర్ కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నారు. క్రికెట్‌కు వీడ్కోలు పలికిన తర్వాత అక్తర్ క్రీడా విశ్లేషకుడిగా రాణిస్తున్నాడు. ఇటీవల ముగిసిన 2026 టీ20 ప్రపంచకప్‌లో కూడా ఆయన పాక్ మీడియా ఛానళ్లలో నిపుణుడిగా వ్యవహరించాడు.

# ఒక యూట్యూబర్ తీసిన సినిమాకు భారత్‌లో వసూళ్ల వర్షం!

**-భారత్‌లో సంచలనం సృష్టిస్తున్న హాలీవుడ్ హారర్ చిత్రం 'అబ్సెషన్'**
**-కేవలం రూ.7.5 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన చిత్రం**
**-భారత్ లో రూ.79 కోట్లకు పైగా వసూళ్లు**
**-ఈ ఏడాది ఇండియాలో అతిపెద్ద హాలీవుడ హిట్‌గా నిలిచిన సినిమా**
**-భారత్‌లో వచ్చిన స్పందన చూసి షాక్ అయ్యానన్న 26 ఏళ్ల దర్శకుడు**

హాలీవుడ్‌లో ఓ చిన్న హారర్ సినిమా బాక్సాఫీస్ వద్ద పెను సంచలనం సృష్టిస్తోంది. 26 ఏళ్ల కర్రీ బార్కర్ దర్శకత్వం వహించిన 'అబ్సెషన్' చిత్రం భారత్‌లో ఊహించని విజయాన్ని అందుకుంది. ఈ సినిమా ఇప్పటివరకు మన దేశంలో రూ.79 కోట్లకు పైగా వసూళ్లు సాధించి, 2026లో అతిపెద్ద హాలీవుడ్ హిట్‌గా నిలిచింది. కేవలం రూ.7.5 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా, భారీ అంచనాలతో విడుదలైన 'ప్రాజెక్ట్ హెయిల్ మేరీ' (రూ.75 కోట్లు) వసూళ్లను అధిగమించడం విశేషం. భారత్‌లో అత్యధిక వసూళు సాధించిన హాలీవుడ్ చిత్రాల జాబితాలో 'అబ్సెషన్' ప్రస్తుతం 28వ స్థానంలో ఉంది. మరో కోటి రూపాయలు వసూలు చేస్తే 'అవెంజర్స్: ఏజ్ ఆఫ్ అల్ట్రాన్' (రూ.80 కోట్లు) రికార్డును కూడా దాటేస్తుంది. ఒకప్పుడు యూట్యూబర్‌గా ఉండి, దర్శకుడిగా మారిన 26 ఏళ్ల కర్రీ బార్కర్ ఈ విజయంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ముఖ్యంగా భారత్‌లో తన సినిమాకు ఈ స్థాయిలో ఆదరణ లభిస్తుందని తాను ఊహించలేదని అన్నారు. ప్రేక్షకులు సినిమాలోని సన్నివేశాలను రీక్రియేట్ చేస్తూ కామెడీ వీడియోలు చేయడం, ఫ్యాన్ ఆర్ట్ గీయడం వంటివి చూసి షాక్‌కు గురయ్యానని తెలిపారు. ఈ విజయం అల్గారిథమ్‌ల కంటే ఫిలిం మేకర్స్‌పై నమ్మకం పెంచడానికి దోహదపడుతుందని ఆశిస్తున్నట్లు బార్కర్ పేర్కొన్నారు. యువ దర్శకులు మంచి కాంట్రాక్టులు, క్రియేటివ్ కంట్రోల్ సాధించుకోవాలని సూచించారు. కాగా, ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే 334 మిలియన్ డాలర్లకు పైగా వసూలు చేసి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచింది.



## రజనీకాంత్ కొత్త చిత్రం 'ధర్మన్' టైటిల్ ప్రకటించిన కమల్ హాసన్




సూపర్ స్టార్ రజనీకాంత్, లోకనాయకుడు కమల్ హాసన్ కలయికలో వస్తున్న సినిమాకు సంబంధించి కీలక అప్‌డేట్ వచ్చేసింది. ఇప్పటివరకు 'తలైవా 173'గా ప్రచారంలో ఉన్న ఈ చిత్రానికి 'ధర్మన్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. కమల్ హాసన్‌కు చెందిన రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ సందర్భంగా విడుదల చేసిన టైటిల్ పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఆపరేషన్ థియేటర్‌లో రజనీకాంత్, చేతిలో సర్జికల్ బ్లేడ్‌తో నిల్చొని ఉండగా. ఆయన కాలు కింద ఒక రౌడీ పడి ఉన్నట్టుగా ఈ పోస్టర్‌ను డిజైన్ చేశారు. దీంతో ఈ సినిమాలో రజనీ డాక్టర్‌గా కనిపించబోతున్నారనే ప్రచారానికి బలం చేకూరింది. టైటిల్ పోస్టర్‌ను షేర్ చేస్తూ కమల్ హాసన్ 'ధర్మమే వెల్లుమ్!' (ధర్మమే గెలుస్తుంది) అని ట్వీట్ చేశారు.వాస్తవానికి ఈ ప్రాజెక్ట్‌కు మొదట దర్శకుడిగా సుందర్ సిని ప్రకటించారు. కానీ, ఆయన తప్పుకోవడంతో ఆ తర్వాత సిబి చక్రవర్తి పేరు తెరపైకి వచ్చింది. అయితే, అనూహ్యంగా ఆయన కూడా ప్రాజెక్ట్ నుంచి వైదొలిగారు.

## అభిమాని పులి సీత 11 ఏళ్ల కల.. నెరవేర్చిన చిరంజీవి




సోషల్ మీడియా రీల్స్‌తో గుర్తింపు తెచ్చుకున్న నటి పులి సీత చిరకాల స్వప్నం నెరవేరింది. తన అభిమాన కథానాయకుడు, మెగాస్టార్ చిరంజీవిని కలవాలన్న ఆమె 11 ఏళ్ల నిరీక్షణకు తెరపడింది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చిరంజీవిని కలవడంపై ఆమె భావోద్వేగంతో మాట్లాడిన వీడియో వైరల్ కావడంతో స్వయంగా చిరంజీవే ఆమెను తన నివాసానికి ఆహ్వానించి ఆత్మీయంగా పలకరించారు. ఈ ఘటన మెగాస్టార్ గొప్ప మనసుకు నిదర్శనమని అభిమానులు ప్రశంసిస్తున్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పులి సీత మాట్లాడుతూ.. "తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనం దొరుకుతుందేమో కానీ, చిరంజీవి గారిని కలవడం అంత సులభం కాదు" అంటూ కన్నీటి పర్యంతమయ్యారు. సినీ పరిశ్రమకు వచ్చి పదకొండేళ్లు గడిచినా తన ఆరాధ్య దైవాన్ని కలిసే అవకాశం రాలేదని, ఆయన వద్ద ఉన్నవారు తనకు సహకరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో విస్తృతంగా వ్యాపించి, చిరంజీవి దృష్టికి వెళ్లాయి. అభిమాని ఆవేదనను గమనించిన చిరంజీవి వెంటనే స్పందించారు. తన బృందంతో పులి సీతను సంప్రదించి, నిన్న తన ఇంటికి రావాల్సిందిగా ఆహ్వానించారు. ఊహించని ఈ పిలుపుతో ఉబ్బితబ్బిబ్బయిన పులి సీత, మెగాస్టార్ నివాసానికి వెళ్లి ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా చిరంజీవికి ఆయన ఆరాధ్య దైవమైన ఆంజనేయస్వామి చిత్రపటంతో కూడిన ప్రత్యేక ఫొటో ఫ్రేమ్‌ను బహుమతిగా అందించారు. ఆ కానుకను స్వీకరించిన చిరంజీవి ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. "గిఫ్ట్ విలువ దాని ధరలో ఉండదు. దాన్ని ఇచ్చే వ్యక్తి ప్రేమ, అభిమానంలో ఉంటుంది. నాకు అత్యంత ఇష్టమైన హనుమంతుడి చిత్రాన్ని ఇవ్వడం చాలా ప్రత్యేకంగా అనిపించింది. ఇది నా హృదయానికి ఎంతో దగ్గరైన కానుక" అని ఆయన పులి సీతను అభినందించారు.

# 'వారణాసి' సెట్స్ పై ఎంఎంఏ ఫైటర్ తో రాజమౌళి

# ఎవరీ యోగేశ్ జాదవ్?

**-రాజమౌళి-మహేష్ బాబు సినిమా సెట్స్‌లో కొత్త వ్యక్తి**
**-ప్రొఫెషనల్ ఎంఎంఏ ఫైటర్ యోగేశ్ జాదవ్‌తో జక్కన్న**
**-భారీ యాక్షన్ సన్నివేశాల కోసమే ఈ ఎంపిక**
**-'వారణాసి' పేరుతో తెరకెక్కుతున్న భారీ బడ్జెట్ చిత్రం**
**-సెట్స్ నుంచి వీరిద్దరి ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్**



దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబు కాంబినేషన్ లో వస్తున్న వరల్డ్ అడ్వెంచర్ యాక్షన్ మూవీ వారణాసి. తాజాగా ఈ సినిమా గురించి మరో ఆసక్తికరమైన అప్‌డేట్ బయటకు వచ్చింది. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమా సెట్స్ నుంచి కొన్ని ఫొటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ ఫొటోలలో రాజమౌళి పక్కన 6.5 అడుగులకు పైగా ఎత్తుతో ఉన్న ఓ భారీ కాయుడు కనిపించడం అందరిలోనూ ఆసక్తి రేకెత్తిస్తోంది. అతడి కంటే ఎత్తుగా కనిపించేందుకు సరదగా రాజమౌళి కుర్చీ ఎక్కి నిలబడడం ఈ ఫొటోల్లో చూడొచ్చు. ఇంతకీ ఆ ఫొటోల్లో జక్కన్నతో ఉన్న వ్యక్తి మరెవరో కాదు, భారత్‌కు చెందిన ప్రొఫెషనల్ ఎంఎంఏ (మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్) ఫైటర్ యోగేశ్ జాదవ్. క్రీడా వర్గాల్లో 'ది జెంటిల్ జెయింట్'గా పేరుపొందిన యోగేశ్, బిగ్ బాస్ మరాఠీ వంటి రియాలిటీ షోల ద్వారా కూడా సుపరిచితుడే. మహేశ్ బాబుతో తెరకెక్కిస్తున్న ఈ భారీ యాక్షన్-అడ్వెంచర్ చిత్రంలో కీలకమైన యాక్షన్ సన్నివేశాల కోసం రాజమౌళి అతడిని ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. 'వారణాసి' సినిమా కోసం కాశీ నగరాన్ని తలపించేలా భారీ సెట్స్‌ను నిర్మించారు. ఈ సెట్స్‌లోనే రాజమౌళి, యోగేశ్ జాదవ్‌తో చర్చిస్తున్న ఫొటోలు ఇప్పుడు వైరల్ అయ్యాయి. సినిమాలో అత్యంత శక్తివంతమైన, హై-ఆక్టేన్ ఫైట్ సన్నివేశాలను డిజైన్ చేయడంలో యోగేశ్ పాలుపంచుకుంటున్నట్లు సమాచారం. ఈ చిత్రాన్ని 2027 ఏప్రిల్ నాటికి ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్రబృందం లక్ష్యంగా పెట్టుకుంది.

# 'పుత్రోత్సాహం' అంటే ఇదే.. తండ్రిగా గర్వపడుతున్నా: రామ్ చరణ్‌పై చిరంజీవి భావోద్వేగ ట్వీట్

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన కుమారుడు రామ్ చరణ్‌ను 'న్యూ ఏజ్ మెగాస్టార్' అని సంబోధించడం పై మెగాస్టార్ చిరంజీవి ఆనందంతో ఉప్పొంగిపోయారు. ఒక తండ్రిగా గర్వపడుతున్నానంటూ సోషల్ మీడియా వేదికగా తన సంతోషాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా సుమతీ శతకంలోని ఓ పద్యాన్ని ఆయన ఉటంకించారు. 'పుత్రోత్సాహము తండ్రికి పుత్రుడు జన్మించినపుడే పుట్టదు, జనులా పుత్రుని గనుగొని పొగడగా, పుత్రోత్సాహంబు నాడు పొందుర సుమతీ' అనే పద్యాన్ని పోస్ట్ చేస్తూ.. కొడుకు పుట్టినప్పుడు కాకుండా, అతని గొప్పతనాన్ని చూసి ప్రజలు మెచ్చుకున్నప్పుడే తండ్రికి నిజమైన ఆనందం కలుగుతుందని చిరంజీవి పేర్కొన్నారు. ఇటీవలే 'పెద్ది' సినిమాతో భారీ విజయాన్ని అందుకున్న రామ్ చరణ్, రిపబ్లిక్ టీవీ నిర్వహించిన ఒక ప్రతిష్టాత్మక కార్యక్రమంలో గెస్ట్‌గా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రధాని మోదీ, రామ్ చరణ్‌ను ప్రశంసించారు. ప్రధాని పాల్గొన్న వేదికపై చరణ్‌కు దక్కిన గౌరవం చూస్తుంటే తండ్రిగా గర్వంగా ఉందని చిరంజీవి తన పోస్ట్‌లో తెలిపారు. తన కృషి, అంకితభావంతో చరణ్ దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకోవడం సంతోషంగా ఉందన్నారు. రామ్ చరణ్ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, తెలుగు సినిమా ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా విస్తరింపచాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు 'ఎక్స్' వేదికగా రాసుకొచ్చారు. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది.









Publisher: AKULA SWATHI , printed at SUNDAY PRINTING PRESS, FLAT. NO.363B,1st FLOOR,MADHAVARAM NAGAR COLONY ,RANGAREDDY, TELANGANA - 500072 .
Published at H.NO.15-56/1, Village & Mandal CHERIAL , SIDDIPET District ,Telangana state - 506223, Editor :THADEM PRASHANTH Cell :9000306455